క్లుప్తంగా

వైద్యపరికరాల మరమ్మతుల్లో జాప్యం తగదు



వైద్యపరికరాల మరమ్మతుల గురించి వివరిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని వైద్యపరికరాల మరమ్మతుల్లో జాప్యం తగదని కర్నూ లు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్ఓడీలు, సైరిక్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందితో వైద్యపరికరాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని పలు విభాగా ల్లో వైద్యపరికరాల మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సైరిక్స్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

7న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7న ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు తెలిపారు. తెల్లవారు జాము నుంచే పూజలు ప్రారంభమవుతాయన్నారు.శుభ మంగళ హారతి శృంగార దర్శన హారతి, శ్రీల ప్రభు పాద హారతి, శ్రీమద్భాగవత ప్రవచనం, ఉద యం 9.30 గంటలకు సర్వదర్శనం,చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు,రాత్రి 10 గంటలకు మహా శంభాభిషేకం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

కర్నూలు (టౌన్): ఆధార్ కార్డు నమోదు, మార్పు, చేర్పులకు నగరంలోని 14 ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి మరో రెండు రోజుల పాటు(ఈనెల 25 వరకు) మాత్రమే పనిచేస్తాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక కేంద్రాలు ఇవే..

నాగప్ప వీధి (సచివాలయం నెంబర్-131), మంగల్ వీధి (9), మామిదాలపాడు (99), వెంకటాద్రినగర్ (70), బుధవారపేట (33), ఎన్‌టీఆర్ కాలనీ (107), లక్ష్మీనగర్ (61), గాంధీనగర్ (30), శ్రీనివాసనగర్ (90), దండిగేరి (20), రామలింగేశ్వర్‌నగర్ (115), ఐటీసీ కంపెనీ (78), చల్లా కాంపౌండ్ (121), శ్రీనగర్ కాలనీ(51) సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.

26న పెద్దాసుపత్రి హెచ్‌డీఎస్ సమావేశం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నారు. మధ్యా హ్నం 3 గంటలకు ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సమావేశం గురించి ఎంపీ, ఎమ్మెల్యేలకు, అధికారులకు సమాచారం పంపించారు. ఆసుపత్రికి నూతన సూప రింటెండెంట్‌గా డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం జరుగుతు న్న తొలి హెచ్‌డీఎస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

26న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సులో చేరే వారికి ఈనెల 26న మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10 గంటలకు కళాశాలలోని న్యూ ఆడిటోరియంలో హాజరుకావాలన్నారు.

వ్యాక్సిన్ తప్పనిసరి



బాలింతలకు సిరప్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణీలు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్‌లు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని వడ్డేగేరి యూపీహెచ్‌సీ పరిధిలోని షరాఫ్‌బజార్ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, వ్యాక్సిన్‌లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. గర్భిణులు, ఐదేళ్ల లోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేసి, వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. గర్భిణులకు ఐరన్‌మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హకీమ్ రషీద్ ఉన్నారు.

నర్సింగ్ పరీక్షల్లో కాపీయింగ్

- మెడికల్ కాలేజీలో జనరల్ నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలు
- 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహణ
- చూచిరాతను ప్రోత్సహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తనిఖీ చేయగా పట్టుబడిన కాపీ చీటీలు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో ఈనెల 17 నుంచి ప్రారంభమైన నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ యథేచ్ఛగా జరుగుతోంది. ఉమ్మడి కర్నూలు, వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల నుంచి 51 నర్సింగ్ స్కూళ్లకు చెందిన 400 మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, చీఫ్ ఎగ్జామినర్‌గా సీఎస్ఆర్ఎంఓ, చీఫ్ ఇన్విజిలేటర్‌గా నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్నారు. మరో 20 మంది ఇన్విజిలేటర్లుగా నర్సింగ్ స్కూల్, ఆసుపత్రి పరిపాలన విభాగం ఉద్యోగులు ఉన్నారు. కాగా వీరు మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు నర్సింగ్ స్కూళ్ల నుంచి భారీ మొత్తంలో మామూళ్లు ముడుతుండటంతోనే విద్యార్థులు చీటీలు పెట్టి పరీక్ష రాస్తున్నా ఇన్విజిలేటర్లు ఏమీ అనడం లేదని తెలుస్తోంది. అధికారులు సైతం ఈ పరీక్షల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే పరమావధిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక ప్రతిరోజూ ఆసుపత్రి బయట ఉన్న జిరాక్స్ షాప్‌లో విద్యార్థులు మైక్రో పద్ధతిలో కాపీచీటీలను జిరాక్స్ చేయించుకుని పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్తున్నారు. నిబంధనల ప్రకారం మైక్రో కాపీలను జిరాక్స్ చేయడం చట్టవిరుద్ధం. అయినా రోజూ సదరు జిరాక్స్ షాప్‌లో మైక్రో జిరాక్స్ యథేచ్ఛగా సాగుతోంది.

పరీక్ష కేంద్రం తనిఖీ..

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వి.వెంకటేశ్వరరావు బుధవారం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థుల వద్ద కాపీచీటీలు ఉండటం చూసి అవాక్కయ్యారు. కింది అంతస్తులో తనిఖీలు చేస్తుండగా పై అంతస్తు నుంచి విద్యార్థులు పదుల సంఖ్యలో కాపీచీటీలను కిందకు పడేశారు. దీన్ని బట్టి కాపీయింగ్ ఏ మేరకు జరుగుతుందో అర్థమవుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కాపీయింగ్ యథేచ్ఛగా జరుగుతోందన్న విమర్శలున్నాయి.

మరో సారి కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తాం

కాపీయింగ్ విషయమై పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారెడ్డిని వివరణ కోరగా.. తనిఖీలో కొందరు విద్యార్థుల వద్ద కాపీ చీటీలు లభ్యమయ్యాయన్నారు. వారిని హెచ్చరించి వదిలేశామని, మరోసారి కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామన్నారు. ఇకపై పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు.

వలంటీర్ల సేవలు సద్వినియోగం చేసుకోండి



మహిళలకు పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): వలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అజీముద్దీన్ నగర్, టీచర్స్ కాలనీ, ప్రేమ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తెచ్చారన్నారు. పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వలంటీర్లకు చెబితే వాళ్లే దరఖాస్తు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్ రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషిరాజ్, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీఎల్ఓ సస్పెన్షన్

కర్నూలు(సెంట్రల్): ఆదోని అసెంబ్లీ నియోజకవర్గంలోని 124వ పోలింగ్ స్టేషన్ బీఎల్ఓ జి.భక్తతుకారం(వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగులేషన సెక్రటరీ)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లతో అమర్యాదగా ప్రవర్తిస్తూ తగిన సమాచారం ఇవ్వకుండా సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. విచారణ జరిపించగా ఆరోపణలు నిజమేనని తేలడంతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీఈడీ పరీక్షల్లో 134 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీఈడీ పరీక్షల్లో 2,228 మందికి గానూ 2,094 మంది హాజరయ్యారని, మిగతా 134 మంది విద్యార్థులు గైర్హారయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీపీఈడీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వీసీ పేర్కొన్నారు.

ఆడిట్ రిపోర్టులు ఇవ్వండి

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా ఆధ్వర్యంలోని మ్యాక్స్ సంఘాలకు సంబంధించి 2022-23 ఆర్థికసంవత్సర ఆడిట్ రిపోర్టులను ఇవ్వాలని జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయకసహకార సంఘాల చట్టం కింద ప్రత్యేకంగా నమోదైన సంఘాలు..2022-23లో చేపట్టిన లావాదేవీలపై ఆడిట్ చేయించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజుల్లో ఆడిట్ రిపోర్టులను తమ కార్యాలయంలో సమర్పించాలని, లేకపోతే ఆయా సంఘాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

27 నుంచి రాధాగోవిందుల ఝులన్ యాత్ర

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు రాధా గోవిందుల ఝులన్ యాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు ప్రత్యేక అలంకరణ, ప్రవచనం, మహారాజ భోగ నివేదన ఉంటాయన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపాలని ఈనెల 25న విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న జాతీయసదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పది లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఆర్‌ఆర్‌బీ, ఐబీపీఎస్ ఉద్యోగాల భర్తీ కోసం ఏటా నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలోని ఏటా డీఎస్సీ, పోలీసు ఉద్యోగాలతోపాటు గ్రూపు పరీక్షలను నిర్వహించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఉన్నతాధికారుల సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల సమావేశం గురువారం విజయవాడలో నిర్వహించనున్నారు. సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి.వెంకటరామం హాజరుకానున్నారు. ఇందులో బస్సుల ఆపరేషన్స్ ప్లానింగ్, బస్సుల నిర్వహణ, కొత్త బస్సుల ప్రతిపాదన, గ్యారేజీ సమస్యలు, వర్క్‌షాప్ అంశాలపై చర్చ జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

కర్నూలు(హాస్పిటల్): సినీ నటుడు చిరంజీవి అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి సూచించారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నగర సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో చిరంజీవి-పవన్‌కళ్యాణ్ యువసేన ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 17న ప్రారంభమైన బస్సుయాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య కోరారు. బుధవారం సీఆర్ భవన్‌లో బస్సుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో బస్సు యాత్ర సెప్టెంబర్ 1, 2 తేదీల్లో జరుగుతుందన్నారు. 1న కర్నూలు 2న ఆలూరు, పత్తికొండలో యాత్ర ఉంటుందన్నారు. ఆయా సభలకు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు మునెప్ప, ఎస్ఎన్ రసూల్, పి.రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, మహేష్, శ్రీనివాసులు, సోమన్న పాల్గొన్నారు.

వీహెచ్‌పీ 'సేవా సంకల్పం'



వీహెచ్‌పీ అఖిల భారతీయ కార్యదర్శి అజయ్ పరేఖ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ సేవా సంకల్పంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని వీహెచ్‌పీ అఖిల భారతీయ కార్యదర్శి, సేవా కన్వీనర్ అజయ్ పరేఖ్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం విజ్ఞాన పీఠం (అరక్షిత శిశుమందిరం)ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వీహెచ్‌పీ రాష్ట్రాధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. అలాగే ఆయన బుధవారపేటలో మాతృశక్తి - సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ భవానీ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాసరాజ్, కార్యదర్శి గురుమూర్తి, వీహెచ్‌పీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, విభాగ్ సేవా కన్వీనర్ పి.పి. గురుమూర్తి, రాష్ట్ర సేవా కన్వీనర్ డాక్టర్ రామ్మూర్తి, దుర్గావాహిని జిల్లా కన్వీనర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజా వేదిక ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ బి.రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీపీ, షుగర్, పక్షపాతం, మూర్ఛ వ్యాధులకు రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందజేయనున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరారు.

సురక్షితంగా గమ్యానికి చేర్చాలి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు. బుధవారం ఆయన డిపో గ్యారేజీలో డ్రైవర్లకు పలు సూచనలు ఇచ్చారు. సంస్థపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ప్రమాదాలు లేకుండా సర్వీసులు తిప్పాలని, ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వంలో విలీనమైన పీటీడీ(పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్) ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన పీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70, 71 జీఓల నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సంజీవరాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): పాతబస్తీలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మునిసిపల్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం నాయకులు నాయకులు అబ్దుల్ దేశాయ్, చాకలి రవికుమార్, గోరే బాయ్, మూసా అహ్మద్, వలితో కలిసి ఆయన 9, 10 వార్డుల్లో పర్యటించారు. డ్రెయినేజీలు, సిమెంట్ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తమ దృష్టికి తెచ్చారని, మున్సిపల్ అధికారులు స్పందించిసమస్యలు పరిష్కరించాలనినాయకులు కోరారు.

వాహనాల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): ఆదోని మండలం ఎస్.కొండాపురంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, టిప్పర్‌ను బుధవారం జిల్లా మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, టిప్పర్ పట్టుబడ్డాయి. ఎంత మోతాదులో మట్టిని తవ్వారో పరిశీలించి వాహనాల యజమానులకు జరిమానా విధిస్తామని డీడీ తెలిపారు.

ఈ శ్రామ్ కార్డుతో పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఈ-శ్రామ్ గుర్తింపు కార్డు తప్పనిసరి అని కార్మిక శాఖ కర్నూలు సహాయాధికారి కేశన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు తప్పనిసరిగా ఈ శ్రామ్ కార్డులు పొందాలని, సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.




దర్బార్‌లో తమ సమస్యలు చెప్పకుంటున్న హోంగార్డు, మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు: పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం హోంగార్డులకు సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు దర్బార్ నిర్వహించారు. ఎస్పీ కృష్ణకాంత్ హాజరై పోలీసుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసులు ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, కుటుంబాల గురించి ఆలోచించాలని చెప్పారు. ఏడాదికోసారి మెడికల్ చెకప్ చేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. సిబ్బంది సమస్యల తీవ్రతను బట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు మెసేజ్ కానీ, వాట్సాప్ ద్వారా కానీ సమాచారం తెలియజేయాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగం..

కర్నూలు హోంగార్డు యూనిట్‌లో పని చేస్తూ హోంగార్డు మదనగోపాల్ అనారోగ్యంతో చనిపోయారు. అతని భార్య బి నాగేశ్వరమ్మకు హోంగార్డు ఉద్యోగం కల్పించారు. అలాగే ఆదోని యూనిట్‌లో పని చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడిన హోంగార్డు దేవేంద్రప్ప ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం హోంగార్డు కాంట్రిబ్యూషన్, ఆదోని పోలీసులు పోగు చేసిన మొత్తం రూ.2.59 లక్షలు హోంగార్డు కమాండెంట్ చేతులమీదుగా దేవేంద్రప్ప భార్య ఎం.లక్ష్మికి అందజేశారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్‌రెడ్డి, ఆర్ఐ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయించండి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, పీఆర్ ఇంజినీర్లతో ఈకేవైసీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వైఎస్ఆర్ చేయూత, చేదోడు, అమ్మ ఒడి తదితర పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీని త్వరగా పూర్తి చేయించేందుకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ చేదోడుకు సంబంధించి హొళగుంద మండలంలో, జగనన్న అమ్మ ఒడికి సంబంధించి కర్నూలు అర్బన్‌లో ఎక్కువగా ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాంలో పరిష్కరించిన సమస్యలకు సంబంధించి ఈకేవైసీ కర్నూలు అర్బన్‌లో ఎక్కువగా ఉందన్నారు. చివరి దశలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంట్, ఇసుక కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పీఆర్ ఎస్ఈ ఎస్ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో చంద్రయాన్-3 ప్రత్యక్ష వీక్షణ




సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన ప్యానల్ ద్వారా వీక్షిస్తున్న విద్యార్థులు



ఆల్ ది బెస్ ఇస్రో అంటూ అభినందనలు చెబుతున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారు జగన్నాథగట్టులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ)లో బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 జాబిలిపై దిగే దృశ్యాలను వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన ప్యానల్స్ ద్వారా విద్యార్థులు ఆ దృశ్యాన్ని చూసి ఆనందించారు. జాబిలిపై విక్రమ్ ల్యాండర్ దిగిన వెంటనే సంబరాలు చేసుకున్నారు.

మాంటిస్సోరిలో..

చంద్రయాన్-3 విజయవంతంగా జాబిల్లిపై కాలు మోపడంతో బుధవారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరీ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు 'ఆల్ ది బెస్ట్ ఇస్రో' అంటూ అక్షరాల రూపంలో నిల్చొని అభినందనలు తెలిపారు.

ఆర్చరీ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆర్చరీ పోటీలను బుధవారం కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కెవి. సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా ప్రతినిధులు గంగాధర్, దాసరి సుధీర్, చిట్టిబాబు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



టంగుటూరి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏపీఎస్ఎస్ఎస్ నాయకులు

కర్నూలు కల్చరల్: స్థానిక దేవీ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీ ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పసుపుల ఎంపీటీసీ మురళీకృష్ణ, ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, నాయకులు కోలుకుల చంద్రశేఖర్, కంచు గంటల శ్యామ్ సుందర్‌రావు, జిల్లా అధ్యక్షులు నాగులవరం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో..

కర్నూలు సిటీ: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు, నాయకులు సత్యనారాయణ గుప్తా, బతుకన్న, దామోదరం రాధాకృష్ణ, బాబురావు, పోతుల శేఖర్, ఎస్.చంద్రశేఖర్ పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.

యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో..

కర్నూలు(హాస్పిటల్): జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా యువజన సంక్షేమాధికారి పీవీ రమణ, సెట్కూరు కార్యాలయ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

డాక్టర్ హేమనళినికి పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళినికి పదోన్నతి లభించింది. డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉన్న ఆమెను సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి గుంటూరు ఫీవర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంఓగా బదిలీ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం నాయకులు గౌస్‌దేశాయ్, పి.నిర్మల, బి.రామాంజనేయులు, పీఎస్ రాధాకృష్ణ తదితరులు బుధవారం కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వేదవతిని త్వరగా పూర్తి చేయాలని, గుండ్రేవుల ప్రాజెక్టును చేపట్టాలని కోరినట్లు వారు చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఇటీవల నిర్వహించిన పాదయాత్రను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.